వడగండ్ల వాన బీభత్సం

రాయికోడ్ కురుస్తున్న భారీ వర్షం

న్యాల్‌కల్ మండలం టేకూర్‌లో కురుస్తున్న వడగండ్ల వర్షం

జహీరాబాద్, మార్చి 22: అల్పపీడన ద్రోణి ప్రభావంతో జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతోపాటు వడగండ్లతో కూడిన భారీవర్షం కురిసింది. వడగండ్ల వానతో జొన్న, శనగ తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. మామిడి కాయలు నేలపాలయ్యాయి. కూరగాయల పంటల రైతులకు ఈ వర్షం తీవ్ర నష్టం కలిగించింది. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు ఈదురుగాలులకు విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతోపాటు తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఝరాసంగంలో...

ఝరాసంగం, మార్చి 22: మండలకేంద్రంతోపాటు తుమ్మన్‌పల్లి, బోప్పన్‌పల్లి, సంఘం(కె), కంభాలపల్లి, గుంతమర్పల్లి, జీర్లపల్లి, పార్యవరం తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో ఆయా గ్రామాల్లో చేతికొచ్చిన జొన్న, మక్క పంటలు నేలకొరిగాయి. పిందె దశలో ఉన్న, కోతకొచ్చిన మామిడి, ఉల్లి పంటలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. బోప్పన్‌పల్లి, సంఘం(కె) గ్రామాల శివారులో రహదారిపై చెట్లు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అక్కడి గ్రామస్తులు వచ్చి చెట్ల కొమ్మలను తొలిగించడంతో రాకపోకలు కొనసాగాయి. మండల కేంద్రంలోని కేతకీ ఆలయానికి కొద్దిదూరంలో ఈదురుగాలుల వల్ల విద్యుత్ స్తంభం కూలింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్ సహాయంతో మరమ్మతులు చేశారు. జీర్ల పల్లి గ్రామంలో పిల్లలు వడగండ్లతో గోళీలు ఆడుకున్నారు. ఈ వర్షం సామాన్యులకు ఎండ నుంచి, ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం దొరికినప్పటికీ.. రైతులకు మాత్రం తీవ్ర నష్టం ఏర్పడింది.

రాయికోడ్ మండలంలో...

రాయికోడ్, మార్చి 22: మండలపరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడ్డ ప్రజానీకానికి కొంత ఉపశమనం కలిగింది. వర్షంతో మామిడి కాయలు, సాగులో ఉన్న జొన్న, శనగ పంటలు తదితర పంటలకు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వనగండ్లు పడడంతో ఇబ్బందులకు గురయ్యారు.

కంగ్టిలో...

కంగ్టి, మార్చి 22: నెల నుంచి సూర్యుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు శనివారం కురిసిన వర్షంతో చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. ఉదయం నుంచి వాతావరణం చల్లబడగా మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. సుమారు 10నిమిషాలపాటు కేవలం వడగండ్లు పడడంతో వీధులన్నీ వడగండ్లతో నిండిపోయాయి. అనంతరం అరగంట పాటు వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ఝరాసంగం మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఈదురుగాలులకు బోప్పన్‌పల్లిలో నేలకొరిగిన జొన్న పంట

డైనేజీ జామ్ తొలిగింపు

పటాన్‌చెరు, మార్చి 22: అకాల వర్షం వల్ల ఏర్పడిన డైనేజీ జామ్‌ను పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తొలిగింపజేశారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌లో జాతీయ రహదారిపైనున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదుట డైనేజీ జామ్ అయ్యింది. రాత్రి అకాల వర్షం కురవడంతో వాననీరు, చెత్తాచెదారం వచ్చి డైనేజీ జామ్ అయ్యింది. జీహెచ్‌ఎంసీ అధికారులను, సిబ్బందిని పిలిపించి జేసీబీలతో డైనేజీలలో ఇరుక్కున్న చెత్తను కార్పొరేటర్ తీయించారు. మరో రెండు రోజులు అకాల వర్షాలున్నాయని అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలపై అర్ధరాత్రి అయినను స్పందిస్తానని మెట్టు కుమార్‌యాదవ ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

న్యాల్‌కల్ మండలంలోని టేకూర్‌లో కురిసిన వడగండ్లు, ఝరాసంగం మండలంలో వడగండ్లను జొగ్గులో నింపిన దృశ్యం, జేసీబీలతో మురుగుకాలువలను శుభ్రం చేయిస్తున్న పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

కొండాపూర్‌లో పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి

కొండాపూర్, మార్చి 22: కొండాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ వల్లూరు క్రాంతి పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. తేర్పోల్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా భూగర్భజలాలపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. అనంతరం మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరగుతుండడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పోషకాహారం అందుతున్న తీరును తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని, ప్రతిభను పరిశీలించారు. నీటి వృథాను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం విరివిగా చేపట్టాలని, భూగర్భ జలాల సంరక్షణకు కృషి చేయాలన్నారు. భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అనిత, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామీణ అభివృద్ధి శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలరాజు, ఎంఈవో దశరథ్, రవి, బాలకృష్ణ, సంతోశ్‌కుమార్, గణేశ్, లలితాకుమారి ఉన్నారు.

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం

గుమ్మడిదల,మార్చి 22: ప్యారానగర్ డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని 46 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం గుమ్మడిదల మున్సిపాలిటీలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో రైతు మహిళా జేఏసీ సభ్యులు పాల్గొన్నారు. వీరికి రైతు జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, మంబాపూర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని డంపింగ్‌యార్డును రద్దు చేయాలని నినాదించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మొండి పట్టుదలతో డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయకపోవడం సరైనది కాదన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. ఉదయ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్, మల్లమ్మ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మందులు దగ్ధం

అందోల్, మార్చి 22: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ప్రభుత్వ దవాఖానలో మందులు నిల్వచేసే గది కాలిపోయింది. శనివారం రాత్రి దవాఖాన ఆవరణలో ఉన్న మందులు నిల్వచేసే గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్దగా మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. మందులు నిల్వచేసే గది కావడంతో కాటన్లతోపాటు ఇతర పరికరాలు ఉండడంతో మంటలు పెద్దగా చెలరేగినట్లు తెలుస్తుంది.

సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌కు పాదపూజ చేసిన వేద విద్యార్థులు

గురువే జ్ఞానదీపం

ఝరాసంగం, మార్చి 22: జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్యనేర్పిన గురువులను, రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి 1008 మహామండలేశ్వర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. మహామండలేశ్వర్‌గా నియమితులైన సందర్భంగా శనివారం ఆశ్రమంలో 2017-20 సంవత్సరానికి వేద విద్యను అభ్యసించిన విద్యార్థులు పాదపూజ చేసి సన్మానించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, వేద పాఠశాల ఆచార్యులు శివ శంకరయ్య స్వామి, అర్చకులు శ్రీపాద స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జామియా మసీదులో ఇఫ్తార్

కంది, మార్చి 22: కంది జామియా మసీదులో శనివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఖాజా ఖాన్, షేర్‌అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షను విరమించారు. విందులో పాల్గొన్న వారందరికీ ఖాజాఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాసిత్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జావీద్, లియాఖత్ అలీ, గఫర్ ఖాన్, కరీం, సత్తార్‌ఖాన్ పాల్గొన్నారు.

పనులు వేగంగా చేపట్టాలి

జహీరాబాద్, మార్చి 22: జహీరాబాద్‌లో నిర్మిస్తున్న జడ్పీహెచ్ఎస్ పనులు వేగంగా చేపట్టాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యవంతంగా చేపట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ కసాబ్‌గల్లీలో టెన్త్ పరీక్షకేంద్రాలను, మొగుడంపల్లి మండలంలోని పలు పాఠశాలలను విద్యాధికారి తనిఖీ చేశారు.

వ్యక్తి అస్తిపంజరం లభ్యం

కంది, మార్చి 22: మండలంలోని చిమ్మాపూర్ తండా ధర్మసాగర్ చెరువు వద్ద వ్యక్తి అస్తిపంజరం లభ్యమైంది. చెరువు వద్ద వ్యక్తి చనిపోయి సుమారు 5 నెలలు గడుస్తున్నా ఎవరూ గుర్తించలేకపోయారు. శనివారం అటుగా వెళ్లిన స్థానికులు మృత దేహానికి సంబంధించిన ఎముకలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అస్తిపంజరాన్ని బయటకు తీసి చనిపోయింది ఎవరన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు.

చెట్టు పడి ఇద్దరికి గాయాలు

జహీరాబాద్, మార్చి 22: అల్పపీడన ప్రభావం వల్ల ఈదురుగాలులకు చెట్టు విరిగిపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. న్యాల్‌కల్ మండలంలోని శంశోల్లాపూర్ గ్రామానికి చెందిన యశ్వంత్, లోకేశ్ కలిసి శుక్రవారం రాత్రి కిరాణ సామగ్రి తీసుకురావడానికి బైక్‌పై బీదర్‌కు వెళ్లారు. బైక్‌పై సామగ్రిని తీసుకుని వస్తుండగా షాపూర్ రైల్వే గేటు సమీపంలోని బీదర్-జహీరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న చెట్టు ఈదురుగాలులకు విరిగి వారిపై పడింది. వారికి తీవ్రగాయాలు కావడంతో బీదర్ పోలీసులు వైద్య కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ క్షేమంగా ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా పనితీరును పరిశీలిస్తున్న డైరెక్టర్ నందకుమార్, ఏడీఈ దుర్గా ప్రసాద్, ఏఈ రవీందర్

పాలాల సందర్శన

గుమ్మడిదల, మార్చి 22: మండలంలోని గ్రామాలతోపాటు జిన్నారం మండలంలోని కొడకంచిలోని పంట పొలాలను శనివారం విద్యుత్‌శాఖ డైరెక్టర్ అధికారులు, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. నేరుగా పొలాల వద్దకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సిబ్బంది పనితీరు, విద్యుత్‌ను సకాలంలో సరఫరా చేస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, బొంతపల్లి ఏఈ రవీందర్, మాజీ జడ్పీటీసీ చిన్నపాపని కుమార్‌గౌడ్, రైతులు బాల్‌రెడ్డి, వడ్డె కృష్ణ, అభిలాశ్ గౌడ్, పాతూరు మల్లేశ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ జల దినోత్సవంపై అవగాహన

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బీవీ రాజు ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు

గుమ్మడిదల, మార్చి 22: బీవీరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్ ఆధ్వర్యంలో శనివారం గుమ్మడిదల మున్సిపాలిటీలోని జడ్పీహెచ్ఎస్‌లో జాతీయ జల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు హిమనదుల సంరక్షణ, నీటి సంరక్షణ, గ్లోబల్ వార్మింగ్ ప్రాముఖ్యతపై అవగాహన, క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డా. లక్ష్మి, ప్రసాద్, ప్రిన్సిపాల్ డా.సంజయ్ దూబే, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.కృష్ణారావు, మేనేజర్ బాపిరాజు, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

గడువులోగా ఆస్తి పన్ను చెల్లించాలి

జిన్నారం, మార్చి 22: గడువులోగా ఆస్తి పన్ను చెల్లించాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం హేమైర్ సిస్టమ్స్ పరిశ్రమ ప్రతినిధులు రూ.6,63,230, ప్రీమియర్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యజమాని వివేకానంద రూ.3,02,446 ఆస్తి పన్ను చెక్కురూపంలో అందజేశారు. 14 బృందాలతో ఆస్తిపన్ను వసూలు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపి పన్ను వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

హత్నూర, మార్చి 22: హత్నూరలోని అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కామన్ డైట్ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ వల్లూరు క్రాంతి కళాశాలకు వచ్చిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన వారు రూ.2 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి కొండాసురేఖ, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ కాంతి, టీవీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సంస్థ కార్యదర్శి వర్షినికి కృతజ్ఞతలు తెలిపారు.

అడవి పంది దాడిలో మహిళ మృతి

జహీరాబాద్, మార్చి 22: అడవి పంది దాడిలో మహిళ మృతి చెందిన ఘటన మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం..హల్లీకేడ్ బాబూమియా, అతడి భార్య మస్తాన్‌బీతో పొలానికి వెళ్లాడు. పశువులకు మేత కోసం బాబూమియా గడ్డి కోస్తుండగా, మస్తాన్‌బీ పొలం గట్టుపై కట్టెలు ఏరుతోంది. పొదల్లో పిల్లలతో ఉన్న అడివి పంది ఒక్కసారిగా దాడి చేసింది. ఆమె తీవ్రంగా గాయపడడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. పొలంలో గడ్డి కోస్తున్న ఆమె భర్త పంది దాడి నుంచి ఆమెను కాపాడి, ఇంటికి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం ప్రదర్శించొద్దు

పారిశుధ్య విభాగం అధికారులతో మాట్లాడుతున్న భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 22: పారిశుధ్యం విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందికి సూచించారు. శనివారం డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో పారిశుధ్యం, యూబీడీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆమె అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కాలనీల్లో, రోడ్లపై చెత్తకుప్పులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. రోడ్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల్లో గ్రీన్ వేస్ట్ ఎప్పటికప్పుడు తొలిగించాలని సూచించారు. పార్కులకు సంబంధించి ఇప్పటికే మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు.కార్యక్రమంలో ఏఎంవోహెచ్ విజయరామారావు, సూపర్‌వైజర్లు అనిల్, శ్రీనివాస్, రాజు, జిలానీ, జ్యోతి తదితరులు ఉన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

పీచెర్యాగడి రైతు వేదికలో రైతులకు శిక్షణనిస్తున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

కోహీర్, మార్చి 22: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సంగుపేట్ ఏరువాక వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ పత్తి పంటలో అధిక దిగుబడులు పొందేందుకు అధిక సాంద్రత పద్ధతిలో మొక్కలు నాటాలన్నారు. ఎకరానికి 25వేల నుంచి 35వేల మొక్కలు నాటితే 10 నుంచి 13 క్వింటాళ్ల పత్తి దిగుబడి లభిస్తుందన్నారు. ఈ పద్ధతి ద్వారా చేనులో ఉన్న పత్తి మొక్కలకు కాయ ఒకే సారి పగిలి అధిక దిగుబడి వస్తుందన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగులు, కాయ తొలుచు పురుగుల నివారణకు ఎకరానికి పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలని సూచించారు. విప్రోనిల్, ఎసిటమిప్రైడ్ రసాయనాన్ని పిచికారీ చేయాలని కోరారు.40రోజుల మధ్య మొపిక్వాట్ క్లోరైడ్‌ను మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. ముందుగా రైతులందరూ భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పామాయిల్ తోటల సాగుకు సబ్సిడీ అందిస్తున్నామన్నారు. అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేశ్, డాక్టర్ స్నేహలత, ఏడీఏ భిక్షపతి, ఏవో నవీన్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రవీణ్, ప్రశాంత్, మౌనికవర్మ, సంధ్య, సవిత, స్వాతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రవికిరణ్, రియాజ్, వీరారెడ్డి, ఈశ్వరప్ప, రాచన్న, శ్రీపాల్, గోపాల్, శ్రీకాంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

జిన్నారం, మార్చి 22: పోక్సో చట్టంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. 18 ఏండ్లలోపు బాలికలపై దాడికి పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. బాలికలు, మహిళల భద్రత కోసం పలు చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలపై అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. అందివచ్చిన అవకాశాలు, ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఉన్నతస్థానాలకు చేరుకోవడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు సంపూర్ణ సహకారంతోపాటు సీఎస్ఆర్ నిధులను కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో ఆదర్శ పాఠశాల, నారాయణ కళాశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు డీఎస్పీ, సీఐలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా భవిత సెంటర్ ప్రతినిధి దేవలక్ష్మి, ఎస్సైలు దశరథ్, కృష్ణారెడ్డి, హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వీ నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

సదాశివపేట, మార్చి 22: అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దగొల్ల శ్రీహరి అన్నారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలు చేయకుండా రిజిస్టార్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజవర్గ అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమాలకు ఉస్మానియా యూనివర్సిటీ మొదటి అడ్డా అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలను అణచివేసేందుకే నోటీసులు ఇచ్చిందన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు రోషన్‌పటేల్, ప్రధాన కార్యదర్శి నాసీర్, మండల ప్రధాన కార్యదర్శి అక్షయ్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

కంది, మార్చి 22: అక్రమ అరెస్టులతో బెదిరేది లేదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకుడు సురేశ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీ ముట్టడి పిలుపులో భాగంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టును నాయకులు తీవ్రంగా ఖండించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సురేశ్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ అంటే కాంగ్రెస్‌కు ఎందుకంత భయమని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ఇదేనా, ప్రజల గొంతునొక్కే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రవణ్ రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు

అరెస్టయిన బీఆర్ఎస్వీ నాయకులు

నారాయణఖేడ్, మార్చి 22: హెచ్‌సీయూ భూములను వేలం వేయవద్దనే డిమాండ్‌తో శనివారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న బీఆర్ఎస్వీ నాయకులు చింటూ నరేశ్, సాయియాదవ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని, పోరాటాలతో వేలాన్ని అడ్డుకుంటామన్నారు.

హంసవాహన సేవలో వీరభద్రుడు